క్షణికం

బైట హోరుమని వర్షం! తలుపులన్నీ బంధించి భగభగమండే పొయ్యిముందు కూర్చున్న సీతమ్మకి చిరాకు!

వీధిజాబిరీలో నిలబడి మిన్నూ మన్నూ కానరాకుండా కురిసే కుంభవృష్టిలో రోడ్డు కష్టంపడి పరుగెత్తే మనుషుల్ని వింతగా గమనిస్తోంది పాప. మధ్యమధ్య చిట్టి చేతులు చాపి చూరుమీంచి పడే నీటిధారని చెదరగొడుతూంది.

పాపనాన్న - అంటే సీతమ్మ భర్త - ఆఫీసులో బైట వర్షం కురుస్తున్నా వాతావరణం హిమవంతంలాగున్నా వేడెక్కి పొగలూ సెగలూ కక్కుతున్న మెదడుతో కుస్తీ పడుతున్నాడు. అతని చేతిలో ఎర్రసిరా కలం వెనకభాగం నుదుటిమీద టక్కుటక్కుమని కొడుతూంది. ఆలోచనలు!

ఇరుగుపొరుగు అమ్మలక్కలు ఎవరిపనిలో వాళ్లు మునిగిపోయారు. గడియారం అయిదు గంటలు కొట్టింది.

జాబిరీలోంచి పాప వెనక్కి తిరిగి గడియారంవైపు చూసింది. పొయ్యిముందు కూర్చున్న సీతమ్మ గడియారం గదివైపు ఓమారు దృష్టి మళ్లించి మళ్ళీ తనపనిలో నిమగ్నురాలై పోయింది. కట్టెలు పొయ్యిలోకి ఎగదోసి విసినకర్ర తీసుకుని విసరసాగింది.

గిన్నెకు నాలుగువైపుల్నించీ మంట రాజుకుంటోంది.

యాంత్రికంగా ఆమె పొయ్యి విసురుతున్నా ఆమె మెదడులో ఆలోచనలు ముసురుకుంటున్నాయి.

బైట వర్షపు ఉధృతానికి మూసిఉన్న కిటికీ రెక్కలు గింజుకుంటున్నాయి.

ఉండి, ఉండి గుండెలు గుభిల్లుమనేలా ఉరుములు!

నిజానికి తనకేలోటూ లేదు. జీవితంలో సుఖపడ్డానికి అవకాశాలు తక్కువ కావు! భర్తలో సౌమ్యత, మంచితనానికి ఏమీ కొరవలేదు. ఏళ్లు మళ్ళిన వృద్ధులు - తల్లీ తండ్రీ తన కింకా బ్రతికిఉండటం నిజంగా గర్వకారణం!

పెద్దపెద్ద భవంతులూ, కార్లూ, విమానాలూ లేకపోయినా ఉన్న దానిలో ఉన్నంతగా సుఖపట్టానికి ఏలోటూ లేదు.

అటువంటి అర్ధసాకరుడైన భర్త తనకి గర్వకారణం!

ముద్దుగా ముచ్చటగా ఉండే ఒక్కగానొక్క కూతురు పాప తనకి గర్వకారణం!

కాని... కాని ... సువ్యక్తం కాని, అస్పష్టం అయిన...ఏదో...ఏదో...లోటు!

ఏమిటది?

ఏమో?

ఏమీ లేదు. అంతా ఉత్తిదే!

ఆ జబ్బు అందరికీ ఉంటుంది! అది లేందే మనిషి అనిపించుకోలేమో? ఏదో కసి... ఎవరిమీదో కోపం....ఎందుకో అసూయ! ఏదో ఒక జబ్బు! అయితే తన కెవరూ శత్రువులు లేరే?

లేకేం? ఉన్న పెద్ద శత్రువల్లా తన మనసే!

పురాణం
సూర్యప్రకాశరావు

మంట అదృశ్యం అయింది ఉన్నట్టుండి. ఉన్నట్టుండి పొగ దృశ్యం అయింది.

ఎటూ పారిపోకుండా తలుపులన్నీ బంధించబడిఉన్న గదిలో తనముందు నిలబడి, తనమీద దృష్టిసారించి, తనమీదకు దాడిచేసే మనిషిని కళ్లుపీకి ఒళ్లు రక్కే మానుపిల్లిలా తన్ని చుట్టుముట్టింది పొగ.

కళ్ళు మంటలు! కళ్లు మూసే విసినకర్రల కోసం వెతుకులాటలు ... ఎందుకొచ్చిన అవస్థ! ఎప్పటికీ తప్పని అవస్థ! హు! ఆడది! ఆడదాని బ్రతుకంతా అవస్థే!

చేతికి విసినకర్ర దొరికిన నాలుగు నిమిషాలకి కంటికి మంట కనిపించింది. కనిపించిన మంట మళ్ళీ అదృశ్యం కాకుండా సీతమ్మ తగిన జాగ్రత్త చూపించింది.

బైట వాన హోరు పెడుతోంది! పొయ్యిమీద అన్నం కుతకుత మంటోంది.

సీతమ్మ కత్తిపీటముందు వేసుకొని మామిడికాయలు తరగటం ప్రారంభించింది. సీతమ్మ ముందున్న కత్తిపీట మామిడికాయల్ని తరగనని మొండికెయ్యటం ప్రారంభించింది! సీతమ్మ తాలూకు మనసు ఓపికని కబళించటం ప్రారంభించింది. "హు! వెధవ కత్తిపీట! పాడు కత్తిపీట! పదును పట్టించమని ఎన్నిమార్లు చెప్పినా వినిపించుకోరు"- ఆ విసురు భర్తమీదికి.

పిల్లిలా గదిలోకి ప్రవేశించింది పాప!

కత్తిపీటతో కుస్తీపడుతున్న తల్లి పక్కగా వచ్చి కూర్చుంది పిల్లిలా వచ్చిన పాప!

పాప పిల్లిలా వచ్చినా, పక్కన కూర్చున్నా సీతమ్మ గమనించనట్టుగా తన ధోరణిలో తనుండిపోయింది.

బితుకు బితుకుమంటూ ముటముటలాడుతున్న తల్లి ముఖంలోకి చూస్తూ కూచుంది పాప.

ఉన్నట్టుండి ఏదో స్ఫురించినట్టుగా పాప అలమారువైపు నడిచింది.

యథాలాపంగా తలెత్తిన సీతమ్మకి అలమారు రెండో అర అందుకుందుకు విశ్వప్రయత్నం చేస్తున్న పాప కనిపించింది.

"ఏమిటె? ఎందుకా దేవుళ్లాడటం?" అనే కేక పిడుగులా పాప చెవిని పడింది.

లక్ష్యాన్ని సాధించిన పాప వస్తువును గుప్పిటలో పెట్టుకుని మధ్య గదిలోకి దౌడు తీసింది.

సీతమ్మ రెండు చేతులూ విసవిసలాడిస్తూ అలమారు సమీపించగానే అనుకున్నట్టే అయిందని గ్రహించింది. అరణా కాసుల కింద ఉండాల్సిన కొత్త వెండి రూపాయి కనిపించలేదు.

ఆమె ఆవేశం ఉన్నతశిఖరాల నందుకుంది. పెద్ద పెద్ద అంగలు వేస్తూ మధ్యగది గుమ్మం దగ్గరకు నడిచే సరికల్లా కంటిముందు దృశ్యం ఆమెను మరింత వెర్రెత్తించింది.

రూపాయితో పాపాయి ఆడుకుంటోంది చక్రంలా దొర్లుతూంది రూపాయి! రూపాయి దొర్లుతూ...దొర్లుతూ ... గోడ తూము వైపుకి పరుగెడుతోంది.

అరె!...అరె!...అరె!...సీతమ్మ ఒక్క ఉదుటని వెళ్ళి రూపాయిని ఆ తూముబారి నుండి రక్షించింది.

పాపాయి కాళ్లు నేలమీద చిందులు త్రొక్కటం ప్రారంభించాయి. చేతులు నేలమీద తపతప చరవటం ప్రారంభించాయి. నోరు పెద్దగా అరవటం ప్రారంభించింది.

తలంటు

—ఫొటో: వీ పొన్నుస్వామి, మాయావరం

కళ్ళు రెండూ ముత్యాల్లాంటి కన్నీటి చుక్కల్ని విడవడం ప్రారంభించాయి.

"ఏడు! ఏడు! పాడుముండా! దాన్ని ఎక్కడో ఊరేగించేదాకా నీ కళ్లు చల్లబడవు" అంటూ సీతమ్మ తిట్టటం ప్రారంభించింది.

అసలు కథ ఏమిటంటే ఆ ఉదయం సీతమ్మ భర్త రెండురూపాయల నోటు ఆమె చేతిలో పెట్టాడు. రెండు రూపాయలూ మారిస్తే రూపాయి అరణాలు మిగిలాయి. ఒక రూపాయి బిళ్ళా, ఆరు అణా కాసులూను. తళతళా మెరిసే ఆ రూపాయి పాప కంట బడింది. తనకిమ్మనీ, ఆడుకుంటాననీ అడిగింది.

సీతమ్మ అలా వల్ల కాదంది.

పాప ఏడ్చింది!

'పోనీ ఇద్దూ! మళ్లీ ఇచ్చేస్తుందిలే' అని భర్త అనటం తను విన్నది. ఈడ్చి నాలుగు తన్నులు తన్నింది! ఎవరిని? పాపని!

"అడిగిందల్లా అందిస్తే గారం పెరిగి రాక్షసుల్లా తయారవుతారు పిల్లలు" అని సీతమ్మ అభిప్రాయపడింది.

"పోనీ చిన్నపిల్ల ఏదో అడిగింది కదా! ఇవ్వకూడదూ?" – అని అభిప్రాయపడ్డాడు ఆమె భర్త.

"తను అడగానే ఆ రూపాయి తనకెందుకివ్వకూడదు?" —అని అభిప్రాయపడింది పాపాయి.

అప్పట్నించీ వీలుచిక్కినప్పుడల్లా, సందు దొరికినప్పుడల్లా, ఆ రూపాయి కాజెయ్యాలని ఆ రోజల్లా ప్రయత్నిస్తూనే ఉంది పాప. చివరికి ఇప్పటికి సాధించ గలిగింది. కాని ఏం ప్రయోజనం? అమ్మ వచ్చి గద్దలా తన్నుకుపోయింది రూపాయిని! అమ్మ వచ్చి ఏడిపించి పోయింది పాపాయిని! వంటగదిలోకి అంబళ్కిలా వచ్చిపడి జుట్టు పీక్కోవటం ప్రారంభించింది పాపాయి! ఆయుధంలాంటి గొంతును ప్రయోగించి లొంగదీసుకుందుకు ఉద్యుక్తురాలయింది పాపాయి!

విసుగుదల, చిరాకూ, అనే ఆయుధాలకి ఎప్పుడో లొంగిపోయిన సీతమ్మ పాపాయి నోటికి లొంగలేదు. అసలా గోడవే వినిపించుకోనట్టుగా నిర్లిప్తంగా తన పనిలో తను మునిగిపోయింది.

"అసలు పిల్లలు ఇలాగే చెడిపోతారు" – అనుకుంది సీతమ్మ.

"ఈ అమ్మంటే నాకందుకే కోపం" – అనుకుంది పాపాయి.

"పక్కింటి సుందరమ్మగారి అమ్మాయి చూడు పద్దెనిమిదేళ్లు వచ్చాయి. ఇప్పటికీ వాళ్ళమ్మ అన్నం తినిపించాలి, నీళ్ళు పొయ్యాలి, తల దువ్వి బట్టలు కట్టాలి. దాని దైనందిన కృత్యాలన్నీ అలా దాని ప్రమేయం లేకుండా జరిగిపోతూంటాయి. ఛీ! అసహ్యం వేస్తుంది! ఇరవైనాలుగ్గంటలూ వీథిగుమ్మందగ్గర ఒచ్చే పోయే కుసు

★ క్షణికం ★

పాల్ని చూస్తో, చెరుగ్గడులో, తేగలో నములుతూ నిల్చుంటుంది. 'అలా నిలబడకూడదు! తప్పు!' అని కూడా ఎవరో చెప్పాలి. ఆ అమ్మాయికి మధ్యే పెళ్లి సంబంధం ఒకటి వచ్చింది. వచ్చిన పెళ్ళికొడుకు రాగానే పిల్లని చూసి గుటకలు మింగాడు గాని, ఎదురుగుండా కూచున్న పెళ్లికూతురు తల్లి ఏమరుపాటున వెనక్కి చూస్తుంటే ఉన్నట్టుండి జాడ్లోంచి మోచేతి పొడుగు చెరుగ్గడ బైటికి లాగి పళ్ళమధ్య ఇరికించి చీలుస్తుంటే కళ్ళు తేలేసి నివ్వెరబోయి గ్లాసుడు మంచినీళ్లు తాగి బైటపడ్డాడు ఆ పెళ్లికొడుకు.

"అడెవిటే వెకిలి పీనుగా" అని తండ్రి కోరత్తేసరికి "పోదురూ! మీరు మరీనూ! ఈ సంబంధం కాకపోతే దీని తాతలాంటి సంబంధం మరొకటి వస్తుంది. మన అమ్మాయికేం! లక్షణంగా ఉంటుంది" అంటూ కూతుర్ని వెనకేసుకొచ్చింది సుందరమ్మ. ఆ తల్లి ఆ పిల్లని అలా గారంచేసి పాడు చేసేసింది. అలాగే తన కూతురుకూడా పాడయిపోదూ! ఇలా నెత్తికెక్కించుకుంటే! - అనుకుంది సీతమ్మ.

పాప గిచ్చి ఏడుస్తూనే ఉంది! కాళ్ళూ చేతులూ తపతపా కొడుతూనే ఉంది! జుట్టు పీక్కుంటూనే ఉంది. క్షణక్షణానికీ ఆమె కోపం పెరుగుతూనే ఉంది! బైట వాన కురుస్తూనే ఉంది. కిటికీ రెక్కలు గింజుకుంటూనే ఉన్నాయి!

సీతమ్మ ఓపిక, శాంతం హరించిపోతూనే ఉన్నాయి! పాప లేచి కొత్తపద్ధతిలో దాడి మొదలుపెట్టింది! పాప రెండు చేతులూ సీతమ్మవీపుమీద తాండవం చేశాయి! తనజుట్టుబదులు తల్లి జుట్టు పీకటం ప్రారంభించింది. సీతమ్మ విదిలించుకుంది. పాపాయి మీదికొచ్చి సీతమ్మ వీపుమీద కత్తికొద్దీ, చేతికొద్దీ చరిచింది! సీతమ్మవీపు చుర్రుమంది. చుర్రుమంది పాపాయివీపు! గొల్లుమంది పాపాయి. చివరికదో చిన్న యుద్ధంకింద తయారయింది.

ఆ యుద్ధపర్యవసానంగా పాపాయినుదురు గడపమీదపడి నెత్తురుచిమ్మింది. తల దిమ్మమంది. ఒళ్లంతా నెప్పిచేసింది. తలెత్తిచూసేసరికి సీతమ్మ రౌద్రరూపం పాపని మరింత అశక్తురాలను చేసింది. చివరికి ఓటమి తనదిగా అంగీకరించక తప్పలేదు. మెల్లగా లేచి ఒకచేత్తో నుదురు నొక్కుకుంటూ మధ్యగదిలోకి నడిచి మంచమెక్కి బోర్లపడుకుని లోలోపల కుళ్ళికుళ్ళి ఏడవసాగింది పాపాయి!

వర్షపు ఉధృతం సడలిచ్చింది! పొయ్యి మీద గిన్నెలో అన్నం ఉడికిపోయింది! వంటఇంటిపని పూర్తిచేసుకుని ఉస్సురంటూ నిట్టూరుస్తూ పక్కలు వెయ్యటానికి మధ్యగదిలోకి వెళ్లింది సీతమ్మ.

* * *

రాత్రి పదిగంటలయింది! గడియారం గంటలు కొడుతోంది. టేబుల్ ముందు లైటు ముందు కూర్చుని రాసుకుంటూన్న సీతమ్మ భర్త తలెత్తి గడియారంవంక చూశాడు. కిటికీలోంచి చలిగాలి తెరలుతెరలుగా వీస్తోంది!

భర్తకి అన్నంపెట్టి ఎంగిళ్లూ విస్తర్లూ ఎత్తుకుని సీతమ్మ బైటపడేసరికి పదిన్నరయింది. చీరకొంగుతో తడిచేతులు తుడుచుకుంటూ ఉస్సురుస్సురంటూ సీతమ్మవచ్చి భర్తపక్కగా నిలబడింది.

సిరా మరకలయిన అరచేతిని కుర్చీకి రాస్తూ అతను పక్కగా వచ్చి నిలబడ్డ భార్యవైపు చూశాడు.

"పగలూ, రాత్రీకూడా ఈ ఆఫీసు పనేనా" అన్నట్టుగా జాలిగా ఓమారు రాసుకునే కాగితాలవైపూ, అతనిముఖంవైపూ చూసింది సీతమ్మ.

"తెల్లవారింది మొదలు రాత్రి పదింటివరకూ నీకు వంటింటిచాకిరీ తప్పదుకదా" అన్నట్టుగా జాలిగా, బాధగా అతను చూశాడు.

"ఏంచేస్తాం! తప్పదు మరి" అన్నట్టుగా ఇద్దరూ హృదయంలో బరువంతా వ్యక్తమయ్యేట్టుగా నిట్టూర్చి చిరునవ్వు నవ్వుకున్నారు.

"వేసంకాలం, శీతాకాలం అయితే ఎంత చాకిరీ అయినా చెయ్యచ్చు ఏంబాధ ఉండదు. ఈ పాడువానకాలంమాత్రం నాకు మా చెడ్డచిరాకు! అడుగుతీసి అడుగెయ్యటానికి వీల్లేకుండా మోకాలులోతు బురద. కిటికీరెక్కలు తెరిస్తే వానజల్లు! మూస్తే పొగ బైటికి పోవటానికి వీలులేక కళ్ళమంటలు! ఆ కట్టెలన్నీ చెమ్మకుని మండటం లేదు...అబ్బ! నేపడే బాధ అంతా ఇంతా కాదు" — సీతమ్మ ముఖం చిట్లించి విసుగ్గా అంది.

భర్త నవ్వుకున్నాడు! సీతమ్మ మాటలకి అతను ఎప్పుడూ నవ్వుకుంటూనే ఉంటాడు! సీతమ్మ మాటలు ఎవరికైనా నవ్వొస్తాయి!

గడిచిన రోజులూ, గడవబోయేరోజులూ చాలా మంచివిగా అనుకుంటాం. అలాగే సీతమ్మ కూడా అనుకుంటూంటుంది!

"ఈ పాడు వేసంకాలం మటుకు నాకు మా చెడ్డ గుర్భరం బాబూ! ఎంతసేపూ నీడపట్టున కూర్చోవాల్సిందే! ఎడాపెడా వడగాలి! గుమ్మం దాటి అడుగు బైట పెడితే నెత్తిమాడి, కళ్ళు మండుతాయి. కాళ్లు అంటుకుపోతాయి. ప్రాణం తిక్కెత్తిపోతుంది! ఒళ్లంతా చెమటలు! కాకేం! అలా నిముషం పెరట్లోంచి ఇంట్లో కొచ్చేసరికి సతమతమైపోతాం"—అని సీతమ్మ గొణుక్కోవటం అతను అనేక మార్లు విన్నాడు వేసంకాలంలో.

"ఇక ఏ కాలం అయినా ఫర్వాలేదు గాని ఈ శీతాకాలం మటుకు నే భరించలేను బాబు. ఎముకలు కొరికే చలి! అందులో నాకు అసలే చలి ఎక్కువ. తెల్లవారగానే లేవకపోతే పనులు పూర్తిగావు. లేవాలంటే మంచులాంటి చలి ఒళ్లంతా పక్షవాతం వచ్చినట్టుగా వణికి వణికి చచ్చిపడినట్టయిపోతుంది. పళ్లు టకటకా కొట్టుకుంటాయి. ఆ వణుకులో గడపలు కొరుక్కొని, పెదిమలు కొరుక్కొనీ — నానా అవస్థలూ! పాడు శీతాకాలం! ఇంకేకాలం అయినా నాకంత శ్రమలేదు"—అని సీతమ్మ గొణుక్కోవటం అనేక మార్లు విన్నాడు శీతాకాలంలో. ఇప్పుడు వింటున్నాడు వర్షాకాలం గురించి సీతమ్మ అభిప్రాయాలు.

అప్పటి మాటలు స్ఫురణకు వచ్చి నవ్వుకున్నాడు. మళ్ళీ తనపనిలో తను నిమగ్నుడైపోయాడు. సీతమ్మకి నిద్ర ముంచుకొస్తోంది! కళ్లు మూతలు పడుతున్నాయి! ఆవులింతలు వస్తున్నాయి! లేచి వెళ్లి పక్కమీద పడుకుంది. అటూ ఇటూ దొర్లింది. కొద్దికొద్దిగా కునుకుపట్టినా సరిగ్గా నిద్రపట్టడం లేదు. ఏదో లోటు! ఏమిటది?

లేచి కూర్చుని భర్త మంచంవైపుకి చూసింది. పాపాయి చలికి ముడిచిపెట్టుకుని పడుకుంది! చిన్న చిన్న ముంగురులు గాలికి అటూ ఇటూ కదుల్తున్నాయి. ఒక చెయ్యి తలకింద పెట్టుకుని పడుకుంది.

పాపాయి!

అదే లోటు! పాప తనపక్కని పడుకోని రోజు తనకి నిద్రపట్టదు. పాప తనదగ్గరే పడుకోవాలి. ఇంకెవరిదగ్గరా పడుకోవటానికి వీల్లేదు.

భర్త తలవంచుకుని ఏదో రాస్తున్నాడు. సీతమ్మ మెదడు ఏవేవో ఆలోచిస్తోంది.

ప్రతి రాత్రీ అడపా తడపా, మోచేతి పోట్లూ, మోకాలు పోట్లూ పొడిచే పాపాయి తన పక్కని పడుకోకపోతే తనకి నిద్ర పట్టదు. అలవాటు!

సీతమ్మ లేచి పాపనెత్తుకుని తన పక్కమీద పడుకోబెట్టుకుంది. పక్కని కూర్చుని ఆప్యాయంగా పాపనుదురు నిమిరింది సీతమ్మ. చేతికి బొప్పి తగిలింది. ముఖం మీదికి వంగి చూస్తే చిన్న గాయం కంటబడింది. నిజంగా అక్కడ బొప్పికట్టింది.

సీతమ్మ గుండె గతుక్కుమంది. గబగబా వెళ్ళి వేసలైను తీసుకొచ్చి నుదుటికి రాసింది.

ఎంత పని చేసింది తను?! తను ఎంత

మూర్ఖంగా ప్రవర్తించింది! తన వయస్సెంత? దాని వయస్సెంత? ఎంత వ్యత్యాసం! తనకి దానితో పంతమా? పట్టుదలా? ఛా! సిగ్గుండక్కర్లా తనకి!

పాపం! ఇవాళ ఎవరి ముఖం చూసిందో పొద్దుట కళ్ళు తెరిచి. ఎవరి ముఖం చూస్తుంది! తన ముఖమే చూసి ఉంటుంది. పాడు ముఖం! మనసులో గట్టిగా లెంపలు వాయించుకుంది సీతమ్మ.

ఆమె కళ్ళు రెండూ చెమ్మగిల్లాయి. ఎంతపని చేశాను తల్లీ! పాపిష్టిదాన్ని! నా చేతులు విరిగిపోను! నే చచ్చిపోయానే తల్లీ! వెధవ కోపావేశాలు! ఆ వెధవ రూపాయి నీకిస్తే ఏం పోయిందంట! ఆడుకునే పిల్లని కావాలని ఏడిపించానే తల్లీ! క్షమించమ్మా! క్షమించు! పెద్దవాళ్లు కూడా అప్పుడప్పుడు చిన్నవాళ్ళకంటె చిన్నవాళ్లయిపోతారు. ఒక్కగానొక్క కూతుర్ని ఇలాగేనా హింసించటం! పిల్లలు లేక ఏడ్చేవాళ్లు ఎంతమంది లేరు! పిల్లలుండీ వాళ్లని ఏడిపించే తల్లి తను. తను ఇకముందు ఇటువంటి తప్పుడు పన్లు చెయ్యకూడదు. చెయ్యనని ప్రమాణం చేస్తున్నాను. సీతమ్మ హృదయం పశ్చాత్తాపంతో నిండిపోయింది. జాలితో ఆమె అతలాకుతలమైపోయింది.

గదంతా గంభీరమైన నిశ్శబ్దం! సీతమ్మ మనసులో మటుకు పెద్ద హోరు! ఆమె ముఖం చెమటయి చెంపలన్నీ తడిసిపోయాయి! బైట అప్పుడే వెలిసిన తుఫాను, ఆమె మనసులో తిరిగి అప్పుడే ప్రారంభమయింది. చిన్న తుపాను!

అయినా తన కసలు బొత్తిగా ఓరిమి తక్కువ! అయినా తన కసలు ముక్కోపితనం ఎక్కువ! అందుకనే చిన్నప్పుడు తన్ని గయ్యాళి అని పిలుస్తూండేవాళ్లు. అలా అని ఎవరో అంటే కోపం! తన అంతరాత్మ అలాగంటే తనేం చేసేది? నాలుగేళ్ల పసిపాపని రాక్షసిలా నెట్టటమేమిటంట! తన విరగబాటు! ఇంకా నయం భర్తకి విషయం తెలియలేదు! తెలిస్తే తన అంతు తేలేదే!

పాడురూపాయి! ముష్టిరూపాయి! వెధవ రూపాయి! బోడిరూపాయి! గబగబా లేచి అలమారు తెరిచింది సీతమ్మ! అలమారు రెక్కలు కిర్రుమన్నాయి! భర్త తలెత్తి తన వేపు చూశాడు! చూసి ఏమిటి సద్దుతున్నావన్నాడు! అడక్కముందే గతుక్కుమంది సీతమ్మ. గతుక్కుమన్న సీతమ్మ సద్దుకుని అబద్ధం చెప్పింది "ఏమీ లేదు మెళ్లో గొలుసు తీసి ఎందుకైనా మంచిదని దాస్తున్నాను" అని. ఆ సమాధానం అతన్ని నమ్మించి అతని పనిలో అతన్ని నిమగ్నుణ్ని చేసింది.

అలా కొన్ని నిముషాలు యుగాలుగా గడిచిపోయాయి!

ఉన్నట్టుండి సీతమ్మ మెదడులో మెరుపు మెరిసినట్టుగా ఓ ఆలోచన పుట్టింది. లేచి వంటగదిలోకి నడిచింది. అలమారు తీసింది. అరలో అణాకాసులకింద మెరుస్తూన్న రూపాయి చేతిలోకి తీసుకుంది. తను చేసిన తప్పుకు సరైన ప్రాయశ్చిత్తం అదే! అలా చేస్తేనే తన మనసు శాంతిస్తుంది. ఆ రూపాయి తీసుకుని మధ్యగదిలో కొచ్చింది! గడియారం పదకొండు గంటలు కొడుతూంది. బుల్లి పాపాయి బుల్లి చెయ్యి పెద్ద సీతమ్మ పెద్ద చేతిలోకి వెళ్లింది. ఆ బుల్లి గులాబి పువ్వులాంటి అరచేతిలో రూపాయి ఉంచి గుప్పిట మూసింది! ఆ రూపాయి పాపదే! అది దాని సొత్తు! అది పారేసినా సరే, ఖర్చు చేసినా సరే, అదేమన్నా చేసుకోనీ! తనకి ప్రమేయం లేదు.

అమ్మయ్య! ఇప్పుడు మనసు శాంతించింది! గాలివాన వెలిసినట్టుగా ప్రశాంతంగా ఉంది.

భర్త లేచి పుస్తకాలు మూసి, లైటుఆర్పి వచ్చి పడుకున్నాడు. దూరంగా కుక్కలు మొరుగుతున్నాయి! కీచురాళ్లు చెవులు హోరెత్తిస్తున్నాయి. కప్పలు బెకబెకలాడుతున్నాయి! సీతమ్మ మనస్సు తృప్తిగా ఉంది. సీతమ్మ మనసులో ఏ చింతా లేదు. సీతమ్మ హాయిగా నిద్రపోయింది.

* * *

అప్పుడప్పుడే తెలతెలవారుతోంది. మబ్బు విడిచిన సూర్యుడు కొండమీంచి కరకరమంటూ తొంగి చూస్తున్నాడు. ఒడ్డున అరుస్తూ గంతులేసే కప్పలు బుడుంగుమని నీళ్ళల్లోకి దూకుతున్నాయి. కీచురాళ్లు నోరుకట్టేశాయి! ఊరు ఊరంతా మేలుకుంది. ఉదయసంధ్యలో రకరకాల వింత వింత ధ్వనులు సమ్మేళనం పన్నెండుగంటల జాగ్రదావస్థకి నాంది ప్రస్తావన.

పెరట్లో సీతమ్మ ఊరంత గొంతుతో పాలవాడిమీద విరుచుకుపడుతోంది. విరుచుకు పట్టానికి కారణం రాత్రి తోడు పెట్టిన పాలు విరిగిపోవటం! మాటకి మాట తెగులు! నీటికి నాచు తెగులు! మాటమీద మాట పెరిగింది.

మాటమీద మాట పెరిగినా, తనూ అతను సమానంగానే తిట్టుకున్నా, పాలవాడికంటే సీతమ్మ మనసు ఎక్కువ గాయపడింది. పాలవాడికంటే సీతమ్మ ఎక్కువ పౌరుషపడింది! ఛీ! పాలు అమ్ముకుని బ్రతికేవాడి చేత తను మాట పడ్డమా! తన తల కొట్టేసినట్టయిపోయింది!

* * *

కిటికీలోంచి బద్ధకంగా పొగమంచును తెముల్చుకుంటూ బైటపడుతూన్న పొద్దుటి ఎండ పాపాయి నుదుటిమీద పడి మెలుకువ తెప్పించింది. కళ్లు తెరిచేసరికల్లా ఎదురుగుండా ఎదురింటి వాళ్ళ బాబ్జీ నిల్చుని ఉన్నాడు.

"అప్పుడే వచ్చావా బాబ్జీ!" అంటూ పక్కకి ఒత్తిగిలింది పాప.

బాబ్జీ జేబులోంచి ఏదో రెండు కాగితం మడతలు తీసి పాపాయి ఎడం చేతిలో పెట్టాడు.

"ఇందాకట్నించీ చూస్తున్నాను లేస్తావేమోనని ఎందుకు లేవవూ?" — బాబ్జీ ప్రశ్నించాడు.

పాపాయి ఎడం చెయ్యి గుప్పిట విప్పింది.

బాబ్జీ ఇచ్చిన కాగితప్పడవలు!

కుడి చెయ్యి గుప్పిట విప్పింది.

తళతళా మెరిసే కొత్త రూపాయి!

ఏది ముఖ్యం! ఏది అవసరం! ఏది?

బాబ్జీ ఇంత ముఖం చేసుకుని "మా దొడ్డి నిండా బోలెడన్ని నీళ్ళు! మా బాబయ్యకి బోలెడన్ని పడవలు చెయ్యటం వచ్చు తెలుసా! రా ఆడుకుందాం! రా!.. రా!.." అన్నాడు దగ్గరగా వచ్చి.

పాపాయిమటుకు ఓమారు పడవలకేసీ, మరోమారు రూపాయికేసీ చూస్తూ కూర్చుండిపోయింది.

"ఛీ! అదెందుకు? రూపాయి! అవతల పారెయ్యి! మనం ఇంచక్కా ఆడుకుందాం!"—అయిదేళ్ళ బాబ్జీ ముఖం చిట్లిస్తే తమాషాగా ఉంటాడు. పాపాయి వంచిన తల ఎత్తింది.

"పాపా! పాపా! ఆ రూపాయి ఇల్లా తే! ఆ వెధవ ముఖాన్ని గిరవాటెడతాను! మంచీ మర్యాదా లేకుండా నానా అవాకులూ చవాకులూ కూస్తున్నాడు! ఏదీ ముఖం మండాని!" అంటూ సీతమ్మ గదిలో ప్రవేశించింది. ఎఱ్ఱబడి గంటు పెట్టినట్టుగా ఉన్న తల్లి ముఖంలోకి చూడకుండానే, పాపాయి చేతిలో రూపాయిని విసురుగా, నిర్లక్ష్యంగా, ఒక పనికిమాలిన వస్తువును పారేసినట్టుగా దూరంగా గిరవాటు పెట్టింది. అది దొర్లుకుంటూ వెళ్లి సీతమ్మ పాదాల ముందు ఆగిపోయింది.

బాబ్జీ వెనకాలే కిలకిలా నవ్వుతూ, గెంతుతూ చేతిలో కాగితంపడవలు జారిపోకుండా జాగ్రత్తగా పట్టుకుని పరుగు తీసింది పాపాయి!

కాగితంపడవలు!

ఆ పెరట్లో ఆ నీరు ఎంతసేపుంటుంది?!

ఆ ఆనందం పాపాయి ఎంతసేపు అనుభవిస్తుంది?!

అంతా క్షణికం!

సాయంత్రం హోరున వర్షం పడుతున్నప్పుడు సీతమ్మకి వచ్చిన కోపంలాగ... రాత్రి నిద్రపోతున్నప్పుడు సీతమ్మ పొందిన పశ్చాత్తాపంలాగ...

తెల్లవారి గతం మరిచి వర్తమానంలోని

★ క్షణికం ★

● గ్రీకొలలో లొంగిపోయిన సీతమ్మలాగ...

నిన్న సాయంత్రం హోరుమని వర్షం కురుస్తున్నప్పుడు పాపలో రేగిన పట్టుదల లాగ...

తెల్లవారి బాబ్జీ చేతిలో కాగితప్పడవలు కంటపడ్డప్పుడు, పెరట్లో నిలిచిన నీరు కంట బడ్డప్పుడు, మనో నేత్రంలో చిన్ని చిన్ని అలలమధ్య ప్రయాణంచేసే కాగితం పడవలు మెదలినప్పుడు తళతళా మెరిసే రూపాయిమీద కలిగిన తేలికభావంలాగ.

అలాగే...అంతా క్షణికం! చంచలం! గాలి పడగలు! నీటిబుడగలు! కాగితప్పడవలు!

ఆ రూపాయి తీసుకెళ్లి పాలవాడి చేతిలో పడేసింది సీతమ్మ.

చేతిలో కాగితప్పడవల్ని నీళ్ళల్లో వేసింది పాపాయి! ★

రెక్సోనా ప్రొప్రయిటరీ లిమిటెడ్‌వారి తరఫున భారతదేశంలో తయారుచేయబడినది

RP. 181-X52 TL